సాక్షి సూర్యాపేట

ఆదివారం । 3 । మార్చి । 2024



ప్రశాంతంగా జరుపుకోవాలి
మేళ్లచెరువు మండల కేంద్రంలో మహాశివ రాత్రి జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. - 8లో



యాదాద్రిలో భక్తుల సందడి
యాదాద్రిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు భారీగా తరలొచ్చి శ్రీస్వామిని దర్శించుకున్నారు. - 10లో



భారత దేశం.. ఆధ్యాత్మిక ప్రదేశం
ప్రపంచంలో భారతదేశం గొప్ప ఆధ్యాత్మిక ప్రదేశమని యోగా గురువు స్వామి రాందేవ్ బాబా అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

పబ్లిక్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్ (రామంతాపూర్, బేగంపేట)లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 1వ తరగతి (డే స్కాలర్) నందు ప్రవేశానికి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు మార్చి 11 నాటికి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

4న 'పీఎం విశ్వకర్మ'పై అవగాహన
ప్రధాని విశ్వకర్మ పథకంపై ఈ నెల 4న ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతి వృత్తులు, కుల వృత్తులు చేసుకునే వారు, కుల సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఆల్ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. శనివారం సూర్యాపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగుమతి దిగుమతి చేస్తున్న అన్నిరంగాల హమాలీ కార్మికుల వల్ల ప్రభుత్వానికి వ్యాపార సంస్థలకు రూ.కోట్లలో లాభాలు వస్తున్నాయని, ఎగుమతి దిగుమతి ఒక్కరోజూ చేయకుంటే వ్యవస్థ ఎక్కడికక్కడ వ్యవస్థ స్తంభించి పోతుందన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని మార్చి 18, 19న పోరాట జాతా ఊరూర తిరిగి మార్చి 20న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. శుక్రవారం రాత్రికే ఆలయానికి చేరుకున్న రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు తెల్లవారుజామునే కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, ఎపద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ బాలునాయక్

సూర్యాపేట రూరల్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూర్యాపేట ఎస్‌ఐ బాలునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇమాంపేట గురుకుల పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, షీ టీమ్ సిబ్బంది ఎల్లారెడ్డి, సాయిజ్యోతి, యల్లయ్య, గోపి, చారి, గురులింగం, కృష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత పాల్గొన్నారు.

కమ్మేస్తున్న కారుచీకట్లు

శనివారం (ఈనెల 2న) తిరుమలగిరి మండల కేంద్రంలో కారు అతివేగంగా వచ్చి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు.

గత నెలలో అర్వపల్లి మండల పరిధిలోని 365 జాతీయ రహదారిపై గోపాల్‌రెడ్డి నగర్ వద్ద ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళ మృతిచెందదంతో పాటుగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

రెండు నెలల క్రితం విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రెండు కార్లు మునగాలలో అదుపుతప్పి వెనుక నుంచి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇలా కార్లతోపాటు ఇతర వాహనాలు అతివేగంగా నడుపుతుండదంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి.

అతివేగంతో వచ్చి అదుపుతప్పుతున్న కార్లు

- నిద్ర మత్తులో డ్రైవింగ్‌తోనే అధిక ప్రమాదాలు
- గాలిలో కలుస్తున్న అమాయకుల ప్రాణాలు
- రక్తసిక్తమవుతున్న రహదారులు



శనివారం తిరుమలగిరిలోని అంబేద్కర్ నగర్‌లో ప్రమాదానికి గురైన కారు

సూర్యాపేట: జిల్లాలో కారు ప్రమాదాలు అధికమయ్యాయి. కోవిడ్ తర్వాత కార్ల కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. వచ్చీరాని డ్రైవింగ్ చేయడం, అతివేగంతో వెళ్తుండడం వెరసి అదుపు తప్పి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫలితంగా ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. దీంతో రహదారులు రక్తసిక్తంగా మారుతున్నాయి. జిల్లాలో సూర్యాపేట మండలం టేకుమట్ల నుంచి కోదాడ మండలం రామాపురం ఎక్స్ రోడ్డు వరకు ఎన్‌హెచ్ 65, నకిరేకల్ నుంచి నుంచి తుంగతుర్తి నియోజవర్గ పరిధిలోని మద్దిరాల ఎక్స్ రోడ్డు వరకు ఎన్‌హెచ్–365, టేకుమట్ల నుంచి ఖమ్మం వరకు మరో కొత్త జాతీయ రహదారి విస్తరించి ఉన్నాయి. జాతీయ రహదారులతోపాటు ఇతర రోడ్లపై గతేడాది 1,892 ప్రమాదాలు జరిగితే 432 మంది మృతి చెందారు. ఈ ఏడాది పలు ప్రమాదాలు చోటుచేసుకొని ఇప్పటికే 42 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇందులో కారు ప్రమాదాలే అధికంగా ఉన్నాయి.

ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతుల సంఖ్య
2023	1,892	432
2024	118	42పైగా..

రోడ్డు నిబంధనలపై అవగాహన లేక..
రహదారులపై డ్రైవింగ్ చేసే వ్యక్తి రోడ్డు ఎత్తుగా ఉన్నా.. పల్లంగా ఉన్నా గుర్తించాలి. గుంత, వంతెన, కూడలి, ఎక్కడ మీడియన్ గ్యాపులు, మలుపులు ముందే గమనిస్తూ తమ వాహనాలను జాగ్రత్తగా నడపాలి. కానీ, ముఖ్యంగా కార్లు నడిపే వారు ఇవేవీ గమనించడం లేదు. అసలు రోడ్డు భద్రతా నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహన లేక కొందరు తమ కార్లను అతివేగంగా నడుపుతుండడంతో అదుపుతప్పుతూ ప్రమాదాల బారిన పడుతూ ఇతరుల ప్రాణాలు బలితీసుకుంటున్నారు. మరికొందరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కార్లు నడపటం వల్ల ఏకాగ్రత ఉండడం లేదు. ఇలాంటి సమయంలో ముందున్న వాహనం ఒక్కసారిగా ఆగినా, అనూహ్యంగా ఏదైనా వాహనం వచ్చినా ఢీ కొని ప్రమాదం బారిన పడుతున్నారు.

సేఫ్టీ ఫీచర్స్ మరవొద్దు..
సేఫ్టీ ఫీచర్స్ బాగున్న కార్లకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఫైబర్ శాతం ఎక్కువగా ఉన్నవి మైలేజీ ఇస్తున్నా రక్షణ మాత్రం తక్కువే. సేఫ్టీ రేటింగ్ ఎక్కువగా ఉన్న కార్లను ఎంచుకోవాలి. కారులో తప్పనిసరిగా ఎయిర్‌బెలూన్లు ఏర్పాటు చేయించుకోవాలి. ఇలాంటి సేఫ్టీ ఫీచర్స్ ఉన్న కార్లను కొనకుండా తక్కువ రేటులో వస్తున్నాయని ఇతర కార్లను కొనుగోలు చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ట్రాఫిక్ చిహ్నాలు గమనించాలి



రహదారిపై ఉన్న ట్రాఫిక్ చిహ్నాలను గమనిస్తుండాలి. ప్రాంతాన్ని బట్టి వాహనం వేగం ఉండేలా చూసుకోవాలి. వాహనాల మధ్య దూరం చాలా ఉండాలి. తగినంత దూరం పాటించకనే ప్రమాదాల తీవ్రత చాలా ఉంటోంది.

– టీకే రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

అనుభవం లేని డ్రైవర్లు వద్దు



అనుభవం లేని వారిని డ్రైవర్లుగా నియమించుకోవద్దు. రహదారులపై వాహనాలు వాయువేగంతో వెళ్తుంటాయి. అవి ఎంత దూరంలో ఉన్నాయో, ఎంత సమయంలో సమీపిస్తాయో గుర్తించగలగాలి. కొత్తగా డ్రైవింగ్ చేసేవారు భయంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

– ఆర్.సాయిరాం, ట్రాఫిక్ ఎస్‌ఐ, సూర్యాపేట

మద్యం, నిద్ర మత్తుతో డ్రైవింగ్ చేయడం వల్లే..

తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో 70శాతానికిపైగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలు ఉంటున్నాయి. మద్యం మత్తులో కార్లు నడుపుతూ వాటిపై నియంత్రణ కోల్పోయి తమతో పాటు ఎదుటి వాహనాల వాళ్లను ప్రమాదానికి గురిచేస్తున్నారు. దీనికితోడు నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్లలో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే డ్రైవింగ్ చేసేందుకు ఇద్దరు ఉండాలి. ఒక్కరే ఉంటే అలసిపోయి నిద్రలోకి జారుకుని ప్రమాదాల బారిన పడతారు. ప్రతిఒక్కరూ కారు ఎక్కిన తర్వాత సీటు బెల్టు ధరించాల్సి ఉన్నా కొందరు ధరించడం లేదు. దీంతో ప్రమాదం జరిగినప్పుడు ఎగిరి పడి, ముందు సీట్లకు తాకి తీవ్రంగా గాయపడుతున్నారు.

స్ఫూర్తి ప్రదాత.. దుద్దిళ్ల శ్రీపాదరావు



దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్ఫూర్తి ప్రదాత అని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనాతో కలిసి కలెక్టర్ హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దివంగత శ్రీపాదరావు శాసన సభ స్పీకర్‌గా ఉండి ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి
సూర్యాపేట రూరల్, మునగాల: పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో, మునగాలలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించి పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడారు. ధరణి సమస్యల పరిష్కారంలో భాగంగా క్షేత్ర పరిశీలనకు వచ్చే అధికారులకు రైతులు, ప్రజలు సహకరిస్తూ తమ ధ్రువ పత్రాలను చూపాలన్నారు. సోమవారం నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సూర్యాపేట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీఓ బాలకృష్ణ, మునగాల తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

- ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు
- జిల్లావ్యాప్తంగా 95,281 మంది గుర్తింపు
- రేపు, ఎల్లుండి ఇంటింటి కార్యక్రమం



సూర్యాపేట: చిన్నారులు పోలి యో మహమ్మారి బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఏటా అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు వయసు కలిగిన వారికి పోలియో చుక్కలు వేయిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు వైద్యారోగ్యశాఖ సిద్ధమైంది.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

పీహెచ్‌సీలు	23	వలస కుటుంబాల పిల్లలు	8,931
సీహెచ్‌సీలు	03	బూత్‌లు	591
జనరల్ ఆస్పత్రి	01	రూట్లు	42
ఏరియా ఆస్పత్రి	01	రూట్ సూపర్‌వైజర్లు	42
ఐదేళ్లలోపు పిల్లలు	95,281	సంచార బృందాలు	27
		హైరిస్క్ ఏరియాలు	128

క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి
జిల్లాలోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణకు క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లను వైద్య ఆరోగ్యశాఖ పూర్తి చేసింది. బస్టాండ్లు తదితర ప్రాంతాల్లోనూ పల్స్ పోలియో శిబిరాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరిపడా చుక్కల మందును సరఫరా చేశారు. జిల్లా, మండల స్థాయిల్లో పల్స్ పోలియో విజయవంతానికి వైద్యులు, సిబ్బందితో అవగాహన సమావేశాలు, శిక్షణ కూడా పూర్తి చేశారు. మొదటి రోజు ఆదివారం బూత్ స్థాయి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. తర్వాత రెండు రోజులు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఇందుకుగాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌ఎస్‌లు, వైద్యాధికారులతో కలిపి మొత్తం 2,364 మంది సిబ్బందిని నియమించారు. వలస కుటుంబాలకు చెందిన పిల్లలకు కూడా వారు ఉంటున్న ప్రదేశాలకు వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. ఈనెల 3, 4, 5తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం సూర్యాపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజీవ్ నగర్‌లో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. స్వల్ప అనారోగ్యానికి గురైన చిన్నారులు, నీళ్ల విరోచనాలు, జలుబు, దగ్గు, నీరసంగా ఉన్నా సరే తప్పక పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య, వైద్యులు శివప్రసాద్, హరిప్రసాద్, శశాంక్, సూపరిటెండెంట్ శ్రీనివాస్, డీపీఎంఓ కృష్ణ, ఏఎస్‌ఓ మత్స్యగిరి, ఏకస్వామి, రవి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర

- తొలి జాబితాలోనే ఖరారు చేసిన అధిష్టానం
- 2014లో బీఆర్ఎస్ నుంచి ఎంపీగా విజయం, 2019లో ఓటమి
- 2022లో బీజేపీలో చేరిక



డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి : మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర నర్సయ్యగౌడ్‌కు భువనగిరి ఎంపీ టికెట్ ఖరారైంది. శనివారం బీజేపీ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలోనే ఆయనకు చోటు దక్కింది. బూర నర్సయ్యగౌడ్ బీఆర్ఎస్ తరఫున 2014లో భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై విజయం సాధించారు. 2019లో మరోమారు బీఆర్ఎస్ తరఫున పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్‌లో తనకు సముచిత స్థానం, తగిన గౌరవం దక్కడం లేదని మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు, ఇబ్రహీంపట్నం నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన బూర నర్సయ్యగౌడ్.. తెలంగాణ ఉద్యమంలో డాక్టర్స్ జేఏసీ చైర్మన్‌గా కీలకపాత్ర పోషించారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఖమ్మంలో ఆదివారం జరిగే మూడు విప్లవ పార్టీల ఐక్యతా బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన మాట్లాడారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్ మూడు విప్లవ పార్టీలు విలీనం అయి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ ర్యాలీలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పార్టీ జిల్లా నేత పేర్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

హుజూర్‌నగర్: ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు 1వ తేదీన జీతాలు ఇవ్వాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నా అందరికంటే ముందు పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం టీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవభిక్షంను నియమించారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.పరశురాం, జిల్లా ఇన్‌చార్జి బి.నాగరాజు, జిల్లా నాయకులు దేవభిక్షం, ఆరోన్, రామకృష్ణ, వెంకటనారాయణ, వెంకటయ్య, ముక్కంటి, సందీప్, సైదులు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

అంతర్‌రాష్ట్ర రహదారిపై అవస్థలు

- ఇరుకుగా హుజూర్‌నగర్–దాచేపల్లి డబుల్ రోడ్డు
- వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా..
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- ఫోర్ లేన్లుగా మార్చాలంటున్న ప్రయాణికులు



హుజూర్‌నగర్-దాచేపల్లి అంతర్‌రాష్ట్ర రహదారి



మట్టపల్లి వద్ద కృష్ణానదిపై నిర్మించిన హైలెవల్ వంతెన

మఠంపల్లి: హుజూర్‌నగర్ నుంచి వయా మట్టపల్లిమీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా దాచేపల్లి వరకు డబుల్ లేన్‌తో నిర్మించిన అంతర్‌రాష్ట్ర రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఇరు రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీ ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నార్కట్‌పల్లి నుంచి ఏపీలోని మేదరమట్ల ఫోర్ లేన్లకు అనుసంధానంగా వేసిన ఈ డబుల్ రోడ్డులో భాగంగా మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద రెండు తెలుగు రాష్ట్రాలకు వారధిగా కృష్ణానదిపై హైలెవల్ వంతెనను నిర్మించి ప్రారంభించారు. దీంతో ఇప్పటికే తెలంగాణ వైపు ఉన్న కిష్టపట్టి ప్రాంతంలో పేరుపొందిన సిమెంట్ పరిశ్రమలు, మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఉండడంతో నిత్యం వందలాదిగా లారీలు, టిప్పర్లతోపాటు ఇతర వాహనాలు వచ్చి పోతున్నాయి. అయితే ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది.

రోడ్డును విస్తరిస్తేనే ప్రమాదాలు చెక్
రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సంబంధబాంధవ్యాలు ఎక్కువగా ఉండడంతోపాటు పత్తి, మిర్చి పంటల వాణిజ్య వ్యాపార సంబంధాలతో గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ప్రయాణికుల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. దీనివల్ల వాహనాల రద్దీ ఏర్పడి తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో చౌటపల్లి, పెదవీడు, బక్కమంతులగూడెం తదితర గ్రామాలకు చెందిన వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి క్షేత్రం వరకు గల 40కిలోమీటర్ల డబుల్ రోడ్డును ఫోర్ లేన్లుగా మార్చితే పరిశ్రమల నుంచి వచ్చే వాహనాల రద్దీని తట్టుకోవచ్చు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంప్రదించి మట్టపల్లి వద్ద కృష్ణానదిపై నిర్మించిన హైలెవల్ వంతెన నుంచి కేవలం 15కిలోమీటర్ల దూరంలో ఉన్న దాచేపల్లి వద్ద ఫోర్ లేన్లకు అనుసంధానంగా రోడ్డును విస్తరించాలని ఈ ప్రాంత ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఫోర్ లేన్లుగా మార్చాలి



రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై మట్టపల్లి వద్ద నిర్మించిన వంతెనతో వాహనాల రాకపోకలు భారీగా పెరిగి డబుల్ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి ఫోర్ లేన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– గాదె జయభారత్‌రెడ్డి, మఠంపల్లి

ప్రభుత్వం దృష్టిసారించాలి



మఠంపల్లి మీదుగా ఆంధ్రా–తెలంగాణ ప్రాంతాలను కలుపుతూ నిత్యం రద్దీగా ఉండే అంతరాష్ట్ర రహదారిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించాలి. హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు ఫోర్ లేన్లుగా మార్చాలి.

– జాల కిరణ్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ మఠంపల్లి

డబుల్ రోడ్డును విస్తరించాలి



కృష్ణానదిపై నిర్మించిన హైలెవల్ వంతెన ప్రారంభంతో మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆంధ్రా ప్రాంతం నుంచి భక్తుల తాకిడి పెరిగి వాహనాలు భారీగా తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబుల్ రోడ్డును వెంటనే విస్తరించాలి.

– దాసరి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ, మట్టపల్లి

క్లుప్తంగా

కంకర క్వారీలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నల్లగొండక్రైం : నల్లగొండ మండలంలోని రంగారెడ్డినగర్–రాములబండ పరిధిలో శ్వేత స్టోన్ క్రషర్ మిల్లుకు సంబంధించిన క్వారీలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 35–40 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో పశువుల కాపర్లు చూసి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 25 రోజుల క్రితం కంకర కోసం బ్లాస్టింగ్ నిర్వహించారు. బ్లాస్టింగ్‌లో చనిపోయాడా...లేదా ఇతర ప్రమాదమేదైనా ఉందా వ్యక్తి వివరాలు తెలియరాలేదు. ఒంటిపై ఉన్న దుస్తుల ఆధారంగా మగ వ్యక్తిగా గుర్తించారు. డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ కొండల్ రెడ్డిలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తండ్రికి తలకొరివి పెడుతున్న శ్రీలక్ష్మి

మునగాల: మండలంలోని రేపాలలో శనివారం అనారోగ్యానికి గురై మృతిచెందిన ఓ తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన చోటుచేసుకుంది. రేపాల గ్రామానికి చెందిన మోత్కూరి వెంకటేశ్వర్లు(60) సుజాత దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారులు లేరు. ముగ్గురి వివాహం చేసి అత్తవారింట్లకు పంపాడు. కాగా అనారోగ్యానికి గురై శనివారం మృతిచెందడంతో ఇదే గ్రామంలో ఉంటున్న పెద్ద కుమార్తె శ్రీలక్ష్మి ముందుకు వచ్చి తండ్రికి తలకొరివి పెట్టి పితృరుణం తీర్చుకుంది.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ఆలేరురూరల్ : ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామంలో రైతు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. టంగుటూరు గ్రామంలో జెన్నె మల్లేషం వ్యవసాయ క్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ కింద పడేసి లోపల ఉన్న విలువైన రాగి వైర్లు, సామగ్రి మొత్తం ఎత్తుకుపోయారని తెలిపారు. దాదాపు 2 లక్షల రూపాయలు విలువ ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

భువనగిరి క్రైమ్ : గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ముందు నిలిపిన బైక్‌ను అపహరించారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని అర్బన్ కాలనీలో ఇందుప్రియాల మధుసూదన్‌రావు నివాసం ఉంటున్నాడు. రాత్రి ఇంటి ముందు మోటార్‌సైకిల్ పెట్టి ఉదయం లేవగానే మోటార్‌సైకిల్ కనబడలేదు. ఈ విషయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- కారు అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టడంతో దుర్ఘటన
- మృతులు కరీంనగర్ వాసులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో శనివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కాసిరెడ్డిపల్లెకు చెందిన కుంట రమేష్ (31), కోల విక్రమ్ (30) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో తిరుపతికి వెళుతున్నారు. వేకువ జామున మూడు గంటల సమయంలో తిరుమలగిరి అంబేద్కర్ నగర్‌లో కారు వేగంగా వెళ్లి సైడ్‌కు ఉన్న గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఎడమ వైపు ఉన్న కుంట రమేష్, వెనుక సీటులో ఉన్న కోల విక్రమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందారు. కుంట రమేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కోల విక్రమ్ అవివాహితుడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తిరుమలగిరిలో ప్రమాదానికి గురైన కారు



రమేష్ (ఫైల్)



విక్రమ్ (ఫైల్)

రెవెన్యూ గ్రామాల ఆధారంగానే ఫిర్యాదు చేయాలి

అనంతగిరి: అనంతగిరి మండల పరిధిలోని కొత్తగూడెం శివారులోని పాలేరు వాగులో చేపలు పట్టుకునే క్రమంలో జరిగిన వివాదంపై రెండు జిల్లాల పోలీసులు శనివారం స్పందించారు. అనంతగిరి ఎస్ఐ ఎం నవిన్ కుమార్, కొండపల్లి ఎస్ఐ తోటపల్లి నాగరాజులు కొత్తగూడెం శివారులోని పాలేరు వాగును సందర్శించి రెవెన్యూ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు నవిన్ కుమార్, తోటపల్లి నాగరాజు కొత్తగూడెం,కొంగర గ్రామస్తులతో మాట్లాడుతూ..రెవెన్యూ గ్రామాల ఆధారంగానే పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కాగా పాలేరు వాగులో చేపలవేటలో భాగంగా జనవరి 23న కొత్తగూడెం యువకులకు, ఖమ్మం జిల్లా రాయిని గుడెం గ్రామానికి చెందిన బ్రహ్మం అనే వ్యక్తికి చేపలు పట్టే విషయంలో వాగ్వాదం జరగడంతో నేల కొండపల్లి పోలీసులను, కొత్తగూడెం గ్రామస్తులు అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరు వర్గాల వద్ద ఉన్న రెవెన్యూ రికార్డు పత్రాలను పరిశీలించిన పోలీసులు పాలేరు వాగు అనంతగిరి మండలం గోండ్రియాల రెవిన్యూ పరిధిలో ఉన్నందున అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాలు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. కొత్తగూడెం గ్రామస్తులు భూక్యా రవి నాయక్, చేకూరి అశోక్ కుమార్, భూక్యా బాబురావు, తేజావత్ వెంకటేశ్వర్లు, మునగ ఉపేందర్, ఎడవెల్లి అమ్ములయ్య, కొంగర గ్రామస్తులు మాగి శాంతయ్య, నాగేశ్వరరావు ఉన్నారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఎస్ఐలు

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

వేములపల్లి: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అమరోజు మణిదీప్(20) చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందగా తన నానమ్మ అయిన అమరోజు దుర్గమ్మ వద్ద ఉంటున్నాడు. మణిదీప్ రెండు సంవత్సరాలుగా శెట్టిపాలెం గ్రామ శివారులోని ఆదిత్య రైస్ మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడని, కొంతకాలంగా మద్యానికి, జల్సాలకు అలవాటు పడి అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 10.30గంటల సమయంలో తాము నిద్రిస్తున్న సమయంలో మణిదీప్ ఇంట్లోని స్లాబ్ కొండికి చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన నానమ్మ దుర్గమ్మ ఇరుగుపొరుగు వాళ్లను లేపి వేలాడుతున్న మణిదీప్‌ను కిందికి దింపి పరీక్షించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి నానమ్మ దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



మణికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్ఐ కె.రంగారెడ్డి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కుక్కడపు అచ్చయ్య ఇంటిని స్థానికుల సమాచారం మేరకు తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ జి.అజయ్ కుమార్ శనివారం తెలిపారు. అచ్చయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏఎస్ఐ జగన్ ఉన్నారు.

శివన్నగూడలో ఐదు క్వింటాళ్లు..

మర్రిగూడ: అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.రంగారెడ్డి శనివారం తెలిపారు. మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన ఊరె శ్రీనివాస్ తన ఇంట్లో అక్రమంగా 5 క్వింటాళ్ల బియ్యాన్ని నిల్వ చేసుకున్నాడు. బియ్యం నిల్వ ఉన్నాయని తెలిసిన సమాచారంతో దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది నీలకంఠం శ్రీనివాస్, సతీష్, సైదులు, రమేష్, వాహీద్ ఉన్నారు.

కారు, లారీ ఢీ.. నలుగురికి గాయాలు

గరిడేపల్లి : లారీ, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన ధీరావత్ సుధాన్ తన కుటుంబ సభ్యులు హుజూర్‌నగర్ పట్టణంలోని బంధువుల ఇంట్లో శుభకార్యాలకు వెళ్లి శనివారం సాయంత్రం తిరిగి మిర్యాలగూడ వెళ్తున్నారు. ఈ క్రమంలో గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ శివారు వద్దకు రాగానే మిర్యాలగూడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ధరావత్ సుదాన్, మంచానాయక్‌లు తీవ్రంగా గాయపడగా వీరిని వెంటనే హుజూర్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చెట్టుపై నుంచి జారి పడి గీత కార్మికుడు మృతి

రామన్నపేట : తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్నేనిగూడెం గ్రామానికి చెందిన నీల నర్సింహ(62) కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం రాత్రి 7.30గంటల సమయంలో రోజు మాదిరిగానే కల్లు గీయడానికి అంబబావిగూడెం గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. కల్లు గీయడానికి వెళ్లిన నర్సింహ రాత్రి పొద్దుపోయే వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వ్యవసాయబావి వద్దకు వెళ్లాడమో అని భావించారు. శనివారం తెల్లవారుజామున ఐదుగంటల సమయం వరకు కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి రోజూ ఎక్కే తాటిచెట్ల వద్దకు వెళ్లి చూడగా కిందపడి ఉన్నాడు. దగ్గరికి వెళ్లిచూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.



నీల నర్సింహ (ఫైల్)

రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా సత్యనారాయణ



సత్యనారాయణను అభినందిస్తున్న నాయకులు

గరిడేపల్లి : రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన జుట్టుకొండ సత్యనారాయణ(జేఎస్)ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 2న బీఆర్ఎస్‌కు చెందిన ముప్పారపు రామయ్యపై అవిశ్వాసం తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ఓటింగ్ నిర్వహించి, చైర్మన్‌పై అవిశ్వాస ఫలితాన్ని వెల్లడించ వద్దని హైకోర్టు ఆదేశాలివ్వగా ఆ రోజు అవిశ్వాస ఫలితాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 27న రామయ్య వేసిన పిటిషన్ విచారించి అట్టి పిటిషన్‌ను కొట్టి వేస్తూ హైకోర్టు ఆర్డర్ ఇవ్వడంతో శనివారం చైర్మన్ ఎన్నిక నిర్వహించగా జుట్టుకొండ సత్యనారాయణను 9మంది డైరెక్టర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీఓ పద్మ ప్రకటించారు. అనంతరం ఆయనకు ఎన్నికైనట్లు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రి, మండల కాంగ్రెస్ నాయకులకు డైరెక్టర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, పెండెం శ్రీనివాస్‌గౌడ్, పైడిమర్రి రంగరాథ్, కటకం ఆశారమేష్‌తో పాటు పలువురు నూతనంగా ఎన్నికైన జుట్టుకొండ సత్యనారాయణను అభినందించారు.

చిందుకళాకారుడు మృతి

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని సోమారం గ్రామానికి చెందిన నంది అవార్డు గ్రహీత చిందుకళాకారుడు పిల్లిట్ల బాలనర్సయ్య (88) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. పిల్లిట్ల బాలనర్సయ్య చిన్ననాటి నుంచి చిందుకళాకారుడిగా పలు యక్షగాణ, బుర్రకథ, నాటకాలు, ఎన్నో ప్రదర్శనలు రవీంద్రభారతి వంటి పెద్ద పెద్ద వేదికలపై చేశారు. కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోకూడా ప్రదర్శనలు చేశారు. ఇందుకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేతులమీదుగా 1995లో నంది అవార్డు అందుకున్నారు. కాగా బాలనర్సయ్య గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. బాలనర్సయ్యకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలనర్సయ్య అంత్య క్రియలు స్వగ్రామం సోమారం గ్రామంలో నిర్వహించగా పలు చిందు కళాకారులు, ఆయా పార్టీల ముఖ్య నాయకులు సంతాపం తెలిపారు.



బాలనర్సయ్య (ఫైల్)

పురుగుల మందు తాగి ఆత్మహత్య

చండూరు : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చండూరు మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపురం గ్రామానికి చెందిన గొడ్డేటి మమత (32) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. భర్త సైదులు సెంట్రింగ్ పనికి వెళ్లడం గమనించి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె పురుగుల మందు తాగింది. చుట్టుపక్కల వారు గమనించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం నల్లగొండ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్‌లో అతనెవరో..?

- అధికారిక కార్యక్రమాలకు హాజరువుతున్న అనధికారిక వ్యక్తి
- ట్రైనీ కలెక్టర్ అని చెప్పుకుంటూ రెండు నెలలుగా తిష్ట

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఇస్త్రీ బట్టలు ధరించి టక్కు, బూట్లు వేసుకొని చేతిలో ఫైల్‌తో నిత్యం సూర్యాపేట కలెక్టరేట్‌లో దర్శనమిస్తున్న ఆ వ్యక్తి ఎవరనేది ఎవరికీ అంతుపట్టడం లేదు. ఎవరు మీరు అని ప్రశ్నిస్తే ట్రైనీ కలెక్టర్‌ను అని చెప్పుకుంటున్న ఆయన రెండు నెలలుగా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలకు జిల్లా అధికారులతో పాటు హాజరుతున్నారు. రోజూ కలెక్టరేట్‌కు వస్తూ తాను ట్రైనీ కలెక్టర్‌నని, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు తనను విధుల్లోకి తీసుకోవడం లేదని చెప్పుకుంటున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులను కలిశానని అయినా కలెక్టర్ ఆర్డర్ ఇవ్వడం లేదంటున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల విజిటర్స్ గదిలో ఉండటమే కాకుండా ఇటీవల అదనపు కలెక్టర్ చాంబర్‌లోకి వెళ్లి అదనపు కలెక్టర్ చైర్‌లో కూర్చున్నారని, శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓ జయంతి కార్యాక్రమంలో అధికారులతో పాటు పాల్గొన్నారని కలెక్టరేట్ ఉద్యోగులు చెబుతున్నారు. అయితే అతను మతిస్థిమిత్తం లేని వ్యక్తి అని ఉద్యోగులు చెబుతున్నా...అనుకోని సంఘటనలు జరిగే ప్రమాదం ఉన్నందున అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



గత సోమవారం ప్రజావాణిలో అధికారులతో పాటు పాల్గొన్న అనధికారిక వ్యక్తి

బాధ్యతాయుతంగా పనిచేయాలి

బీబీనగర్ : పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, బాధితులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ తరుణ్‌జోషి సూచించారు. శనివారం ఆయన బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. నేర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో రాజీపడవద్దని, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తమ పిల్లల చేతిలో హింసకు గురయ్యే వృద్ధులు పోలీస్‌స్టేషన్‌కు రాలేని పరిస్థితి ఉంటే రాచకొండ వాట్సాప్ కంట్రోల్ రూం నంబర్ 87126 62111కు ఫిర్యాదు చేయవచ్చని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు ధైర్యంగా వచ్చి ఫిర్యాదులు అందజేసే విధంగా పోలీస్ స్టేషన్లలో వాతావరణం కల్పించాలనికోరారు. ఆయన వెంట డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీ, సీఐ,ఎస్ఐలు ఉన్నారు.

జాతర ప్రశాంతంగా జరుపుకోవాలి

మేళ్లచెరువు: మండలకేంద్రంలోని శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివ రాత్రి సందర్భంగా ఈ నెల 8నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరి కల్యాణ మండపంలో ప్రభల కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో మద్యం విక్రయాలు జరపొద్దని, పోలీసు వారి అనుమతితో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి, ఎస్ఐ పరమేష్, నాయకులు కాకూరి భాస్కరరెడ్డి, గోవిందరెడ్డి, సైదేశ్వరరావు, శంకర్‌రెడ్డి, రామచంద్రరావు, వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ



నివాళులర్పిస్తున్న గోద శ్రీరాములు, ఆరుట్ల కుటుంబ సభ్యులు, నాయకులు

యాదగిరిగుట్ట : ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని నిరుద్యోగ యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. శనివారం ఉచిత కంప్యూటర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరుట్ల ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలోని సుమారు 200 గ్రామాల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి సుమారు 3వేల మందికి స్వయం ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, చెక్క వెంకటేష్ పాల్గొన్నారు.

నీటి యాజమాన్యం అత్యంత కీలకం

- మామిడి సస్యరక్షణ చర్యలపై హార్టికల్చర్ కన్సల్టెంట్ సూచనలు

పాడి పంట

నడిగూడెం: ఉమ్మడి జిల్లాలో మామిడి సాగు అధికంగానే ఉంది. ప్రస్తుతం మామిడి పూత, కాయ దశలో ఉంది. ప్రస్తుతం చల్లని వాతావరణంతో ఛీడ, పీడలు ఆశించి, పంటను నష్టపరుస్తాయి. రైతులు పోషక లోపాలు, నీటి యాజమాన్యం సరిగ్గా చేపట్టకపోతే కాయ నాణ్యత, దిగుబడులు తగ్గుతాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అత్యంత కీలకమైన ఈ దశలో సస్యరక్షణ, పోషకాలు, నీటి యాజమాన్యంపై తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు.

ఆశించే పురుగు.. నివారణ చర్యలు

తేనెమంచు పురుగు

ఈ పురుగు రసాన్ని పీల్చడంతో పూత పూర్తిగా మాడిపోయి పిందె పట్టదు. లేత ఆకులు, కొమ్మల నుంచి కూడా రసం పీల్చడంతో ఆకులు ముడత పడి అంటుకొని సరిగా పెరగవు. పురుగులు విసర్జించిన తేనె లాంటి బంక ఆకుల మీద కారి, సూర్యరశ్మి వెలుతురులో మెరుస్తుంది.

నివారణ : లీటరు నీటికి ఫాస్ఫామిడాన్ 0.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ లేదా కార్బరిల్ 3 గ్రాములు లేదా డైమీథోయేట్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. కలిపి పూత మొదలయ్యే సమయం, మరియు పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకులపైనే కాకుండా మొదళ్లపై, కొమ్మలపై పిచికారీ చేయాలి. పూలు పూర్తిగా విచ్చుకోకముందే పిచికారీ చేయాల్సి ఉంటుంది.



పూత దశలో ఉన్న మామిడి



సుందరి సురేష్, హార్టికల్చర్ కన్సల్టెంట్

కాండం తొలిచే పురుగు

ఇవి ఆశించిన కొమ్మలే కాక ఒక్కసారిగా మొత్తం చెట్టు చుట్టూ కూడా ఎండిపోతుంది. ఈ పురుగు తీవ్రంగా ఆశిస్తే మొక్కలు చనిపోతాయి.

నివారణ : ఎక్కువ పాడైన కొమ్మలను తీసివేయాలి. గట్టి ఇనుప తీగెను లోపలికి చొప్పించి పురుగులను బయటకు లాగి చంపివేసి, రంధ్రాల్లో మిథైల్ పెరాథియాన్ 50 శాతం మందును 1 మి.లీ. లీటరు నీటికి కలిపిన ద్రావణం లేదా పెట్రోలు లేదా అల్యూమినియం ఫాస్పైడ్ బిళ్లలను వేసి బంకమట్టితో మూసివేయాలి.

పిండి పురుగు

ఈ పురుగులు భూమిలో కాండం మొదలు దగ్గర పాదగబడిన గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు చెట్టుపైకి పాకి, లేత కొమ్మలు, కాయలు తొడిమలపై గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి.

నివారణ : తొలకరిలో చెట్టు మొదలుదాకా దగ్గరగా దున్నాలి. లేదా పాదులను తవ్వి తిరగవేయాలి. తర్వాత చెట్టు చుట్టూ 2 శాతం మిథైల్ పెరాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ పొడి మందులు చల్లి మట్టిలో కప్పాలి. వీటి పిల్ల పురుగులు చెట్ల కాండం మీదికి ప్రాకి పైకి పోకుండా శీతాకాలంలో చెట్టు మొదలుకు భూమి నుండి అడుగు ఎత్తులో ఒక అడుగు ఎత్తులో ఒక అడుగు నిడివిగల పాలిథీన్ షీట్ కాండం చుట్టూ చుట్టి దీనిపైన గ్రీజు పోయాలి. అప్పుడు పురుగులు పైకి పోలేక షీటు వద్ద గుమికూడుతాయి. వీటిని పదునైన చాకుతో గీకివేసి, నాశనం చేయాలి. లేదా లీటరు నీటికి ఫాస్ఫామిడాన్ 2 మి.లీ. లేదా 1 మి.లీ డైక్లోరోవాస్ లేదా 0.3 మిలీ. ఇమిడాక్లోప్రిడ్ కలిపి పురుగులపై పిచికారీ చేయాలి.

ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు

బూడిద తెగులు సోకినప్పుడు నీటిలో కరిగే గంధకం 2 గ్రా. లేక కెరాథేన్ 1 మి.లీ. లేక మైకోబ్యూటనిల్ 1 గ్రా. లేక టిలటాన్ 1 గ్రా. వీటిలో ఏదైన ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల వ్యవధిలో మందును మార్చి పిచికారీ చేయాలి.

పండు ఈగ

కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఉధృతి ఎక్కువ. లార్వాలు కాయలోని మెత్తని కండను తినటం వల్ల కాయ మెత్తబడి కుళ్లి రాలిపోతుంది.

నివారణ : రాలిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. చెట్టు కింద దున్ని కోశస్థ దశను బయట పడేయాలి. కార్బరిల్ 10 శాతం పొడిని భూమిలో (50–100 గ్రాములు చెట్టుకు కలుపుట), ప్లాస్టిక్ పల్లెంలో మిథైల్ యూజినాల్ 2 మి.లీ. మరియు 3 గ్రాములు కార్బోఫ్యూరాన్ 3 జిని లీటరు నీటిలో కలిపి తోటలో వేలాడగట్టాలి. 2 మి.లీ. మలాథియాన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్యం

- పిందెలు బాదం కాయ సైజులో ఉన్నప్పుడు పాదుల్లో 4 అంగుళాల లోతులో నల్ల పదును ఉండేలా తడులివ్వాలి.
- కాయ కోతకు 15–20 రోజుల ముందు నీరు పెట్టడం ఆపితే కాయ నాణ్యత పెరుగుతుంది.
- నీటి వసతి లేని తోటల్లో కాయ సైజు పెంచడానికి13–0–45 (పొటాషియం నైట్రేట్) లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.